# ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రజల సహకారం అవసరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు: పెన్ పవర్, ఆగస్ట్, 18,**
నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నియంత్రించేందుకు గుంటూరు నగరపాలక సంస్థ (జీఎంసీ) చేపడుతున్న చర్యలు అభినందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణంతో పాటు మానవులు, పశు పక్ష్యాదులకు తీవ్ర ముప్పుగా మారిందని పేర్కొన్నారు.మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి సెల్ఫీ వీడియో ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం, అధికారులు తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇప్పటికే వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించి నోటీసులు ఇచ్చినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై జీఎంసీ అధికారులు ప్లాస్టిక్ స్వాధీనం, ఇతర కఠిన చర్యలు చేపడుతున్నారని తెలిపారు.కేవలం వ్యాపారులను నియంత్రించడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి, వారానికి ఒకసారి పారిశుధ్య సిబ్బందికి అప్పగించే అలవాటు చేసుకోవాలని కోరారు. నీటి సీసాలు, చిప్స్ ప్యాకెట్లు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా వేరు చేయాలని సూచించారు.ప్రభుత్వ చర్యలకు ప్రజల భాగస్వామ్యం తోడైతేనే ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన గుంటూరు సాధ్యమవుతుందని గళ్ళా మాధవి అన్నారు. ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేస్తున్న జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, జిల్లా కలెక్టర్ సిఎం సాయికాంత్ వర్మతో పాటు సంబంధిత అధికారులను ఆమె అభినందించారు.ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
ఎన్.టి.ఆర్ జిల్లా । కృష్ణా । గుంటూరు । పల్నాడు । బాపట్ల

# పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్ తప్పనిసరి

## జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 18:**
పిల్లల ఆధార్‌లో తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేషన్‌ను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సూచించారు. 57 సంవత్సరాలు, 1517 సంవత్సరాల వయస్సు పిల్లలకు సెప్టెంబర్ 30, 2026 వరకు బయోమెట్రిక్ అప్డేషన్ ఉచితంగా అందుబాటులో ఉంటుందని తెలిపారు.విజయవాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆధార్ నమోదు, అప్డేషన్, పెండింగ్ బయోమెట్రిక్ అప్డేషన్లు, ఆధార్ కేంద్రాల పనితీరుపై కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో 57 ఏళ్ల వయస్సు పిల్లలు 31,184 మంది, 1517 ఏళ్ల వయస్సు పిల్లలు 37,470 మంది బయోమెట్రిక్ అప్డేషన్ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 68,654 మంది పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్డేషన్‌ను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.ప్రస్తుతం జిల్లాలో 206 ఆధార్ ఎన్రోల్మెంట్ కేంద్రాలు పనిచేస్తున్నాయని, గత నెలలో ఆధార్ నమోదు, అప్డేషన్‌కు సంబంధించి 28,821 ప్రక్రియలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజలకు ఆధార్ సేవలు మరింత సులభంగా అందేలా విజయవాడ కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలల ద్వారా పిల్లలు, తల్లిదండ్రులకు బయోమెట్రిక్ అప్డేషన్‌పై అవగాహన కల్పించాలని విద్యాశాఖ, ఐసీడీఎస్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆధార్ అవసరమైన సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా తల్లిదండ్రులు తమ పిల్లల వివరాలను ముందుగానే సరిచూసుకుని, అవసరమైన అప్డేషన్లు పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.సమావేశంలో డీఆర్వో ఎం. లక్ష్మీనరసింహం, జిల్లా ఆధార్ నోడల్ అధికారి కె.వై.ఎస్.ఆర్. రవికుమార్, యూఐడీఏఐ అధికారులు, వీఎంసీ, పోలీస్, విద్య, వైద్య, డీఆర్డీఏ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన ర్యాలీ

## ఆర్ అండ్ బి ఇంజనీర్-ఇన్-చీఫ్ వి.రామచంద్ర




**విజయవాడ, పెన్ పవర్, ఆగస్ట్, 18,**
కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ చేపట్టిన 'నశా ముక్త్ భారత్ అభియాన్' (ఎన్ఎమ్‌బిఏ),లో భాగంగా రాష్ట్ర రోడ్లు & భవనాల (ఆర్ అండ్ బి) శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఈ ర్యాలీని ఆర్ అండ్ బి ఇంజనీర్-ఇన్-చీఫ్ వి. రామచంద్ర జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ,రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై ప్రజలను చైతన్యపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రస్తుతం యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే




అరికట్టకపోతే సమాజానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ పరిధిలోని వారికి కూడా అవగాహన కల్పించాలని ఈ ర్యాలీని చేపట్టడం జరిగిందన్నారు. సమాజానికి పెను ముప్పుగా మారిన మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, మత్తు రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ కె.నవీన్ మాట్లాడుతూ**
సమాజానికి పెను ముప్పుగా మారిన మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు, డ్రగ్స్‌కు బానిస కాకుండా ఆరోగ్యకరమైన, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో, యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ బెంజ్ సర్కిల్ మీదుగా ఆర్ అండ్ బి శాఖ హెచ్‌ఓడీ భవనం వరకు సాగింది. అవగాహన ర్యాలీలో సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.వి. భాస్కరరావు, ఇఇ రవిశంకర్, డిఇఇ వై.శశిభూషణ్ తో పాటు శాఖకు చెందిన సుమారు 100 మందికి పైగా అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ప్రజల్లో చైతన్యం నింపారు.

# నవ గుంటూరు లో భాగంగా

## నగరంలో పచ్చదనం కమిషనర్ కె.మయూర్ అశోక్





**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 18,**
మంగళవారం ఉద్యోగ నగర్, జెకెసి కాలేజీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, మల్లికార్జునపురం, బాలాజీ నగర్, చిన్నేరు కుంట, హెడ్ వాటర్ వర్క్స్ ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నవ గుంటూరులో భాగంగా నగరంలో పచ్చదనం పెంపే లక్ష్యంగా మొక్కలు నాటడం జరుగుతుందని, ప్రధానంగా రోడ్లకి ఇరువైపులా, డివైడర్లతో పాటు నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల్లో మొక్కలు కూడా ఉండేలా చూడాలని ఎస్ఈని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్ రెడ్డిపాలెంలోని పార్క్ ని పరిశీలించి, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, పార్క్ లో గ్రీనరీ లాన్, మొక్కలు నాటాలని ఏడీహెచ్, డిఈఈని ఆదేశించి, పార్క్ నిర్వహణకు వాకర్స్ కమిటీ ముందుకు రావాలని కోరారు. రోడ్లకు ఇరువైపులా నాటే మొక్కలకు సపోర్ట్ గా కర్రలను కట్టాలని, ఎప్పటికప్పుడు నీటిని అందించాలని ఏడీహెచ్ ని ఆదేశించారు. చిన్నేరుకుంటని పరిశీలించి, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ ని పరిశీలించి, గుంటూరు నగరానికి ఉండవల్లి దగ్గర ప్రకాశం బ్యారేజి నుండి పైప్ లైన్ ద్వారా నేరుగా నీటిని పంపింగ్ చేసి, తక్కెళ్లపాడు ట్రీట్మెంట్ ప్లాంట్ లో ఫిల్టర్ చేసి, క్లోరింగ్, ఆలం తగు మోతాదులో కలిపి సరఫరా చేస్తామని, గుంటూరు చానల్ నుండి నీటిని తీసుకోవడంలేదన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ లో ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను తనిఖీ చేసి, నిర్దేశిత రిజిస్టర్ లో నమోదు చేయాలని, ప్లాంట్ పరిసరాల్లోకి ఇతరులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అనంతరం ఇటీవల బృందావన్ గార్డెన్స్ రోడ్ విస్తరణలో ప్రభావితమయ్యే చెట్లను ట్రాన్స్ లొకేషన్ లో భాగంగా హెడ్ వాటర్ వర్క్స్ ప్లాంట్ పరిసరాల్లో నాటిన చెట్లను పరిశీలించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏడిహెచ్ ని ఆదేశించారు.పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ శ్రీనివాస్, వెంకటరమణ, ఏడీహెచ్ శాంతి, ఏసిపీ జకిరా, ఎస్ఎస్ లు సోమశేఖర్, అయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గుంటూరు మిర్చి, పసుపు పంటల ప్రాధాన్యతను

## జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌కు వివరించిన బీజేపీ నేతలు



**గుంటూరు : పెన్ పవర్, ఆగస్ట్, 18,**
భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర విస్తృతస్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి విచ్చేసిన నితిన్ నబీన్ కి బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా గుంటూరు జిల్లాలో ప్రధానంగా పండించే వాణిజ్య పంటలు మిర్చి, పసుపు పంటల ప్రాధాన్యత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎగుమతుల్లో గుంటూరు జిల్లాకు ఉన్న ప్రత్యేకతను జాతీయ అధ్యక్షులకు వివరించారు. అనంతరం నితిన్ నబీన్ కి గౌతమ బుద్ధుని మెమెంటో అందజేశారు.రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రాంగణంలోని ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను నితిన్ నబీన్ సందర్శించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లాకు సంబంధించిన స్టాల్‌ను కూడా సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ శివమకుటం, జిల్లా ప్రధాన కార్యదర్శి బజరంగ్ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాలికల రక్షణకు పోక్సో చట్టం

## సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ




**మచిలీపట్నం,పెన్ పవర్ ఆగస్టు 18**
బాలికల రక్షణ కోసమే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారని కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు, సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ అన్నారు. మచిలీపట్నంలోని లేడీ యాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.బాలికలను మానసికంగా, లైంగికంగా వేధించడం, వెకిలి చేష్టలకు పాల్పడటం వంటి చర్యలకు పాల్పడే వారిపై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని బాలాజీ తెలిపారు. బాలికల భద్రత, హక్కుల పరిరక్షణకు చట్టపరమైన నిబంధనలు ఉన్నాయని, విద్యార్థినులు వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తమకు ఎదురయ్యే ఇబ్బందులను భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.విద్యార్థినులు ఇంటర్మీడియట్ స్థాయి నుంచే జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు అంకితభావంతో కృషి చేయాలని బాలాజీ అన్నారు. ఆర్థిక పరిస్థితులు ప్రతిభకు అడ్డంకి కావని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం చిన్నగొల్లపాలెంలో నిరుపేద కుటుంబంలో జన్మించి ఐఏఎస్ అధికారిగా ఎదిగిన ముత్యాల రాజు జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. కష్టపడి చదివి పట్టుదలతో ముందుకు సాగితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని విద్యార్థినులకు సూచించారు.

# బ్యూరోక్రసీ సంస్కరణలు

## : వలస పాలన నుంచి సేవా ప్రభుత్వం వైపు!

## డాక్టర్ జితేంద్ర సింగ్ కేంద్ర మంత్రి



**విజయవాడ,పెన్ పవర్, ఆగస్ట్, 18,**
న్యూఢిల్లీ: వలస పాలన నాటి పరిపాలనా విధానాలను సంస్కరిస్తూ ప్రజలకు మరింత చేరువైన సేవా ప్రభుత్వంగా వ్యవస్థను మారుస్తున్నామని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు.2014లో ఫిర్యాదుల పరిష్కారానికి సగటున 157 రోజులు పట్టగా, ప్రస్తుతం అది 15 రోజులకు తగ్గిందన్నారు. ఖ్రా+=ూమీ ద్వారా 22 భాషల్లో ప్రజలు ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించామని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కార అధికారుల సంఖ్య లక్షకు పైగా పెరిగిందన్నారు.మిషన్ కర్మయోగి ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్య ఆధారిత శిక్షణ అందిస్తున్నామని, సుమారు 1.65 కోట్ల మంది ఉద్యోగులు ఱ+ూ వేదికపై శిక్షణ పొందుతున్నారని తెలిపారు.గ్రూప్-సి, నాన్-గెజిటెడ్ గ్రూప్-బి ఉద్యోగాలకు ఇంటర్వ్యూల రద్దు, పాత ధృవీకరణ నిబంధనల తొలగింపు, 1,600కు పైగా పాత చట్టాల రద్దు వంటి సంస్కరణలు చేపట్టామని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రత్యేక సెలవులు, చైల్డ్ కేర్ సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.అధికారాన్ని కేంద్రీకరించే వలస పాలనా వ్యవస్థను ప్రజలకు సేవ చేసే పరిపాలనగా మార్చడమే సంస్కరణల లక్ష్యం" అని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

# కార్మిక సమస్యలపై ప్రభుత్వాలు స్పందించాలి

## - ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్

**గుంటూరు:పెన్ పవర్, ఆగస్ట్, 18,**
కార్మికవర్గ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టరేట్ వద్ద మంగళవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు.29 కార్మిక చట్టాలను పునరుద్ధరించి, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 73 షెడ్యూళ్లలోని సుమారు 50 లక్షల మంది కార్మికులకు వేతన సవరణ చేపట్టాలని కోరారు. ఔట్సోర్సింగ్, మున్సిపల్, భవన నిర్మాణ, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.జూనియర్ డాక్టర్ల స్టైపెండ్ పెంచి వారి సమ్మెను విరమింపజేయాలని రావులపల్లి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే అన్ని కార్మిక సంఘాలను ఐక్యం చేసి భవిష్యత్తులో పెద్దఎత్తున పోరాటాలు చేపడతామని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా, నగర నాయకులు, వివిధ అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఫోటోగ్రఫి, మష్రూమ్ కల్టివేషన్ కోర్స్ లో ఉచిత శిక్షణ

**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 18 :**
ఫోటోగ్రఫి, వీడియోగ్రఫీ, మష్రూమ్ కల్టివేషన్ కోర్స్ ల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యూనియన్ గామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ సంచాలకులు టి. సందీప్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి మష్రూమ్ కల్టివేషన్ కోర్స్ లోనూ, 16వ తేదీ నుంచి ఫోటోగ్రఫి, వీడియోగ్రఫీ కోర్స్ లోనూ ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత శిక్షణ సమయంలో ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించడం జరుగుతుందని అన్నారు. 19 నుండి 50 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, ఆసక్తిగల యువత తమ వివరాలను యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో నమోదు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు కాపీ, ఆధారకార్డు కాపీ,నాలుగు పాస్పోర్ట్సజు ఫోటోలు, 10వ తరగతి సర్టిఫికెట్ తో గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్ లో డోర్ నంబరు 14-1-14 లో గల యూనియన్ గామీణ స్వయం



ఉపాధి శిక్షణా సంస్థలో అందజేయాలన్నారు. వివరాలకు0863 2336912, 9700687696, 8125397953, 9949930155, 9703405066 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చని వివరించారు.

# అపరాల సాగులో స్వయం సమృద్ధిని సాధించే దిశగా కృషి చేయాలి




**భట్టిప్రోలు, పెన్ పవర్ ఆగస్టు 18:**
రానున్న ఎల్.నినో ప్రభావంతో పంట పొలాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో సీజన్లో మిషన్ ఆత్మ నిర్భరత కార్యక్రమం కింద రైతులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి బి బ్రహ్మారెడ్డి అన్నారు. మంగళవారం పొలంబడి కార్యక్రమంలో జరిగిన సమావేశంలో ఆయన రైతులతో మాట్లాడుతూ అపరాల పంటలలో స్వయం సమృద్ధిని సాధించే లక్ష్యంతో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా అపరాల సాగును ప్రోత్సహించే విధంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మట్టి పరీక్షల ప్రాముఖ్యత, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం,బయో ఫెర్టిలైజర్ల వాడకం, నానో యురియా వినియోగం,సూక్ష్మ పోషకాల వినియోగం (మైక్రో న్యూట్రియంట్) వంటి అంశాలను వివరించడం జరిగింది.అలాగే ప్రదర్శన క్షేత్రాల (డిమానిస్ట్రేషన్) ఆధారంగా పంట దిగుబడిని పెంచే పద్ధతులపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ శాఖ సిబ్బంది,సూరేపల్లి పరిసర ప్రాంత రైతులు పాల్గొన్నారు.

# జక్కంచెర్లకు

## ఉచిత మార్చురీ బాక్స్ వితరణ

### - వెన్నా శ్రీనివాస్ తల్లితండ్రుల జ్ఞాపకార్ధం





**గూడూరు, పెన్ పవర్ ఆగస్టు 18:**
పెడన నియోజకవర్గం గూడూరు మండలం జక్కంచెర్ల గ్రామంలో అభినందనీయ కార్యక్రమం జరిగింది. గ్రామానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్, రాధారంగ మిత్రమండలి సభ్యుడు వెన్న శ్రీనివాస్ తన తల్లిదండ్రులు వెన్నా రామకృష్ణ, నాంచారమ్మ జ్ఞాపకార్థం గ్రామ ప్రజల సౌకర్యార్థం ఉచితంగా మార్చురీ బాక్స్‌ను అందజేశారు.కార్యక్రమానికి రాధారంగ మిత్రమండలి రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి సేవా దృక్పథంతో మార్చురీ బాక్స్‌ను అందించడం అభినందనీయమన్నారు. శ్రీనివాస్‌ను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలని కోరారు.సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్న వెన్న శ్రీనివాస్‌ను రాధారంగ మిత్రమండలి జిల్లా కమిటీలోకి నియమిస్తున్నట్లు బుల్లెట్ ధర్మారావు ప్రకటించారు. ఇప్పటివరకు మచిలీపట్నం మెంబర్‌గా కొనసాగుతున్న ఆయనకు జిల్లా కమిటీలో బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు.గ్రామ ప్రజలకు ఎంతో అవసరమైన మార్చురీ బాక్స్‌ను అందించిన శ్రీనివాస్‌ను గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం. రాఘవమ్మతో పాటు గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో వెన్నా సుబ్రమణ్యం, ఎర్రపోతు బంగారం, వన్నెం రెడ్డి ప్రసాద్, సనక శ్రీనివాస్, మత్తే ప్రసాద్, తాలారీ నాగమల్లేశ్వరరావు, మత్తి పూర్ణచంద్రరావు, ఎల్ఐసీ రాంబాబు, ఆత్మూరి భీమరాజు, వెన్నా శ్రీనివాసరావు, తోట కోదండం తదితరులు పాల్గొన్నారు.

## భట్టిప్రోలు తహసిల్దార్ ను సత్కరించిన

# సచివాలయ సిబ్బంది.



**భట్టిప్రోలు, పెన్ పవర్ (ఆగస్టు,18)**
80 వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్న భట్టిప్రోలు తహసిల్దార్ జి నాగరాజును మంగళవారం భట్టిప్రోలు సచివాలయ సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు సచివాలయం నుండి డిజిటల్ అసిస్టెంట్ జి. రవితేజ, వెల్ఫేర్ అసిస్టెంట్ వి.సురేష్, తదితరులు పాల్గొని తహసిల్దార్ నాగరాజుకు పుష్పగుచ్చాన్ని అందజేసి అనంతరం దుశ్శాలువతో సత్కరించారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి నాగరాజు లాగాగౌరవం దక్కుతుందని సచివాలయ సిబ్బంది వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో నాగరాజు మరెన్నో పురస్కారాలు అందుకోవాలని మరింత ఉన్నత స్థాయిని అందుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నీలం దేవరాజుతో పాటు సచివాలయం సిబ్బంది మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# పి.ఎం. రాహత్ పథకంపై ప్రజల్లోఅవగాహన కల్పించాలి

## : కలెక్టర్ లక్ష్మీశ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు



**విజయవాడ, పెన్ పవర్,ఆగస్టు 18:**
రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి.ఎం. రాహత్ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద బాధితులకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుందని తెలిపారు.ప్రమాదం జరిగిన గంటలోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చే వారికి అర్హత మేరకు 'గుడ్ సమారిటన్'గా రూ.25 వేల ప్రోత్సాహకం అందించే అవకాశం ఉందన్నారు. బాధితుడికి సహాయం చేసే వారికి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని, ప్రజలు భయపడకుండా ప్రమాద బాధితులను ఆసుపత్రికి చేర్చాలని కలెక్టర్ సూచించారు.2026 జనవరి నుంచి జూలై వరకు జిల్లాలో 583 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని, గత ఏడాదితో పోలిస్తే 13.5 శాతం తగ్గాయని తెలిపారు. బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.వి. రాజశేఖర్ బాబు మాట్లాడుతూ, నడిచివెళ్లేవారు, ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయడంతో పాటు రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.సమావేశంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం. పురేంద్ర, వివిధ శాఖల అధికారులు, రహదారి భద్రత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# పనుల నాణ్యతలో రాజీ లేదు

## జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ





**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 18 :**
వసతి, విద్యా సంస్థల నవీకరణ (మార్పు) పనుల నాణ్యతలో రాజీ లేదని జిల్లా కలెక్టర్సి.యం.సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మార్పు కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 36 వసతి, విద్యా సంస్థలలో మార్పు కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని వివరించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన సంస్థలలో సుందరీకరణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడమే కాకుండా కనీస వసతులు పక్కాగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పది మందికి ఒక మరుగుదొడ్డి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీరు పరిరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) నిర్మాణాలు, సౌర విద్యుత్ కల్పన, వ్యర్థాల నివారణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.ఎల్. హర్షిత, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి,జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థసారథి, ఎపిఇడబ్ల్యూఐడిసి కార్యనిర్వహణ ఇంజనీర్ అనిల్ కుమార్, రహదారులు, భవనాలు శాఖ ఇంజనీర్లు, నెడ్ క్యాప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లకు 10 శాతం కోతకోసిన దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి రాచకొండ లక్ష్మయ్య

**గుంటూరు, పెన్ పవర్, ఆగస్ట్, 18,**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్న ప్రతిసారీ బీసీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్నారని లక్ష్మయ్య తెలిపారు. బీసీలు ఎప్పుడూ టీడీపీ పక్షపాతమేనని జగన్మోహన్ రెడ్డి కక్షగట్టారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లలో కోత పెట్టి 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందన్నారు. రిజర్వేషన్లలో కోత వల్ల 16,800 పదవులకు బీసీలు దూరమయ్యారన్నారు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మంత్రి నారా లోకేశ్ తన పాదయాత్రలో గుర్తించారన్నారు. అధికారంలోకి రాగానే బీసీలకు 34 శాతం



రిజర్వేషన్లు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో సీఎం చంద్రబాబునాయుడు సైతం బీసీలకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పిస్తూ బిల్లును రూపొందించామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయనున్నామన్నారు. బీసీలకు మరోసారి రాజకీయ పట్టం కల్పిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి లక్ష్మయ్య తెలియజేశారు.

# ఆపదలో అండగా నిలిచిన మానవతావాదులు

## అంత్యక్రియలకు రూ.11 వేల ఆర్థిక సాయం అందజేత

**వేటపాలెం, పెన్ పవర్, ఆగస్టు 18:**
ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు వేటపాలెం ఎస్సై జనార్దన్, వేటపాలెం పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు పత్తి వెంకట సుబ్బారావు, పరణం అంజన్‌కుమార్. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచి అంత్యక్రియల నిర్వహణకు ఆర్థిక సహాయం అందించారు.వేటపాలెం పంచాయతీ పరిధిలోని బాలాజీనగర్ కాలనీకి చెందిన సుశీలమ్మ సోమవారం సాయంత్రం మృతి చెందారు. ఆమె కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో అంత్యక్రియల నిర్వహణకు అవసరమైన ఖర్చులు భరించడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న దాతలు వెంటనే స్పందించి తమ వంతు సహాయాన్ని అందించారు.వేటపాలెం ఎస్సై జనార్దన్ రూ.5 వేలు, పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు పత్తి వెంకట సుబ్బారావు రూ.5 వేలు, పరణం అంజన్‌కుమార్ రూ.1,000 చొప్పున మొత్తం రూ.11 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దాతల తరఫున ఈ మొత్తాన్ని విశాలాంధ్ర బాపట్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు.కష్ట




సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేసిన దాతలకు సుశీలమ్మ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం



అందించడం ద్వారా సమాజంలో మానవతా విలువలను చాటిన దాతలను పలువురు అభినందించారు.కార్యక్రమంలో మెట్రో ఛానల్ రిపోర్టర్ రామిశెట్టి సుబ్బారావు, నేటి దినపత్రిక సూర్య విలేకరి వెంకట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై

## సీఎంకు ఎమ్మెల్యే మాలకొండయ్య కృతజ్ఞతలు

**అమరావతి, పెన్ పవర్, ఆగస్టు 18:**
స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకోవడంపై చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శాసనసభలో బీసీ ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.
బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక న్యాయానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాలకొండయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకుం

# కలెక్టర్ కృతికా శుక్లా హాజరు




**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, ఆగస్టు 18:**
యడవల్లి గ్రామ పరిధిలోని ఎం/ఎస్ వీరశివ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన వీరశివ2 క్వారీలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు.క్వారీలో బ్లాక్ గ్రానైట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 600 క్యూబిక్ మీటర్ల నుంచి సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో 10,006 క్యూబిక్ మీటర్లకు పెంచేందుకు యాజమాన్యం అనుమతులు కోరింది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా యడవల్లి, గురిజేపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది స్థానికులు, రైతులు పాల్గొని క్వారీ విస్తరణపై తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి స్వీకరించిన అభిప్రాయాలు, వినతులను నమోదు చేసి, వాటిపై నివేదికను రూపొందించి పర్యావరణ శాఖ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రేమోన్మాదుల దురాగతాలకు బలైన

## మైనారిటీ యువతుల కుటుంబాలను ఆదుకోండి : ప్రత్తిపాటి

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి విజ్ఞప్తి
- ఈ నెల 4న ప్రేమోన్మాది బాలసైదులు చేతిలో దారుణంగా హత్యగావింపబడిన షేక్ హసీనా, 6న ప్రియుడి చేతిలో అనుమానాస్పదంగా మృతిచెందిన ఆషా కుటుంబాల్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సీఎంను కోరిన ప్రత్తిపాటి

**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 18:**
ప్రేమ మాయలో పడి... నమ్మిన యువకుల వంచనకు గురై, చివరకు వారి చేతిల్లోనే దారుణంగా హత్య గావింపబడిన యువతులు షేక్ హాసీనా, ఆషా కుటుంబాల్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.మంగళవారం అసెంబ్లీ వాయిదా అనంతరం సచివాలయంలో మర్యాదపూర్వకంగా ముఖ్యమంత్రిని కలిసిన ప్రత్తిపాటి.. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించిన నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మైనారిటీ యువతుల హత్యోదంతాన్ని, కేసు పురోగతిలో పోలీసుల విచారణ తీరును సీఎంకు వివరించారు. మైనారిటీ వర్గానికి చెందిన ఇద్దరు యువతులు నమ్మిన వారిచేతిలోనే హత్యగావింపబడటం దురదృష్టకరమని, చేతికందివచ్చిన బిడ్డల్ని కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న వారి కుటుంబాల్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబును వేడుకున్నారు. బాలికలు, యువతులు, మహిళల పట్ల



ఉన్మాదుల్లా ప్రవర్తించేవారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా, ప్రభుత్వపరంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబును ప్రత్తిపాటి కోరారు.ఎత్తిపోతల పథకాల ఆధునికీకరణ..కొండవీడు అభివృద్ధి.. మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సీఎంను అభ్యర్థించిన ప్రత్తిపాటి ఎల్ నినో ప్రభావం చిలకలూరిపేట నియోజకవర్గంపై అధికంగా ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీర్చే ఎత్తిపోతల పథకాల (లిఫ్ట్ లు) ఆధునికీకరణకు అవసరమైన నిధులు, పాలనా అనుమతులు వెంటనే మంజూరయ్యేలా చూడాలని ప్రత్తిపాటి, ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. అధికారులు సకాలంలో లిఫ్ట్ ల పునరుద్ధరణ పూర్తయితేనే ప్రజల నీటివెతలు తీరుతాయని ప్రత్తిపాటి సీఎంకు తెలియచేశారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్షల్లో అతి ముఖ్యమైన కొండవీడు కోట అభివృద్ధి ప్రణాళికలు కార్యరూపం దాల్చేలా ప్రత్యేక చొరవ చూపాలని, వచ్చే కొండవీడు ఉత్సవాల నాటికి ప్రభుత్వ లక్ష్యాల పూర్తికి అధికారులు సహకరించేలా చూడాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ముఖ్యమంత్రిని అభ్యర్థించారు. చిలకలూరిపేటలో నిర్మించాలనుకున్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ప్రత్తిపాటి, సీఎం చంద్రబాబును కోరారు. పెండింగ్ లో ఉన్న నియోజకవర్గ సీఎం.ఆర్.ఎఫ్, ఎల్.వో.సీ దరఖాస్తుల్ని త్వరగా పరిష్కరించి, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యసేవలకు అవసరమైన నిధులు వెంటనే అందించి వారిని ఆదుకోవాలని ప్రత్తిపాటి, ముఖ్యమంత్రిని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పన దిశగా చరిత్రాత్మక ఆలోచన చేసిన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా ప్రత్తిపాటి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు. గొడ్డలి పార్టీ మోసాలు. జగన్ నయవంచనతో ఐదేళ్లు అన్నివిధాలా నష్టపోయిన బడుగు వర్గాలను అన్నివిధాల అండగా నిలిచేలా కూటమి ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందని ప్రత్తిపాటి సీఎం చంద్రబాబుకు తెలియచేశారు.

## విద్యార్థినులకు 'శక్తి యాప్', స్వీయ రక్షణపై అవగాహన

**చీరాల, పెన్ పవర్,ఆగస్టు 18:**
మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఆధ్వర్యంలో మంగళవారం చీరాల భాష్యం స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ సూచనలతో వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాసరావు, శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థినులకు 'శక్తి యాప్' వినియోగం, యస్ ఓ యస్ సదుపాయం, 112 అత్యవసర నంబర్, స్వీయ రక్షణ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో భయపడకుండా శక్తి యాప్ ద్వారా పోలీసులను సంప్రదించే విధానాన్ని వివరించారు.స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు శ్రీనివాసులు, హెచ్ఎం శిరీష మాట్లాడుతూ బస్టాప్‌లు, పాఠశాల పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను విద్యార్థినులు సహించకూడదని సూచించారు. ఇటువంటి ఘటనలు వారి విద్యాభ్యాసం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపుతాయని తెలిపారు.ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు ఎలాంటి వేధింపులు లేదా ప్రమాదకర పరిస్థితులు ఎదురైనా భయపడకుండా వెంటనే శక్తి యాప్‌లోని యస్ ఓ యస్ ద్వారా లేదా 112కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, స్వీయ రక్షణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శక్తి బృందం సూచించింది. చట్టాలు, తమ హక్కులపై అవగాహన పెంచుకుని సమాజంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చింది.మహిళల గౌరవం, భద్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వేధింపులకు తావులేని సురక్షిత విద్యా వాతావరణం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,




ప్రజలు సమష్టిగా కృషి చేయాలని శక్తి బృందం కోరింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిని 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్'గా

# తీర్చిదిద్దే బృహత్ ప్రణాళిక

- రూ.800 కోట్లతో 34 చెరువుల అనుసంధానం, సుందరీకరణ
- వరద ముప్పు నివారణతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- క్షేత్రస్థాయిలో ప్రణాళికకు రూపకల్పన చేస్తున్న తుడా

**తిరుపతి, పెన్ పవర్ ఆగస్టు 18:**
తిరుపతి నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్' గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్‌అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు గత ఆరు నుంచి ఎనిమిది నెలలుగా ఈ ప్రాజెక్టుపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు, అంతర్జాతీయ పర్యావరణ సంస్థ ఐసీఎల్ఈఐ, ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధులు గత రెండు రోజులుగా తిరుపతిలోని పలు చెరువులు, నీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా. వెంకటేశ్వర్లు, జాయింట్ కలెక్టర్, తుడా వైస్ ఛైర్మన్ ఆర్. గోవిందరావు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ప్రాజెక్టు వివరాలను వెల్లడించారు.

**34 చెరువుల అనుసంధానం**
తిరుపతి నగరంలో ప్రస్తుతం ఉన్న చెరువులను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అనుసంధానం చేసి అభివృద్ధి చేయనున్నట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు. రాబోయే ఐదు నుంచి పదేళ్లలో నగర విస్తరణ, భవిష్యత్‌లో ఏర్పడే గ్రేటర్ తిరుపతి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మొత్తం 34 చెరువులను అనుసంధానం చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనా వేశారు.

జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకు ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. నగరంలో వరద ముంపును నివారించడంతో పాటు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు తిరుపతి ప్రాంతాన్ని ఐదు జోన్లుగా విభజించి దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు వివరించారు.

**మురుగు నీరు చెరువుల్లోకి చేరకుండా చర్యలు**
ఇళ్ల నుంచి వచ్చే మురుగు, మురుగునీరు చెరువుల్లో కలవకుండా ప్రత్యేక మురుగునీటి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే చెరువుల్లోకి చేరేలా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. ఇందుకు అంతర్జాతీయ సంస్థ ఐసీఎల్ఈఐ సాంకేతిక సహకారం అందిస్తున్నట్లు వెల్లడించారు.

**పేరూరు నుంచి అవిలాల వరకు తొలి విడత పనులు**
ప్రాజెక్టులో భాగంగా తొలి విడతలో పేరూరు చెరువు నుంచి అవిలాల చెరువు వరకు 5.6 కిలోమీటర్ల కాలువ అభివృద్ధి పనులకు రూ.7 కోట్లు, అవిలాల చెరువు అభివృద్ధి, కట్ట పనులకు రూ.23 కోట్లతో టెండర్లు ఇప్పటికే పిలిచినట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు.
చెరువుల అభివృద్ధి, సుందరీకరణతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు వాటిని పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. తద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుని బ్యాంకు రుణాల తిరిగి చెల్లింపులు, భవిష్యత్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వివరించారు.

**కపిలతీర్థం నీటితో తాగునీటి సరఫరా**
కపిలతీర్థం నుంచి వృథాగా ప్రవహించే నీటిని అటవీ ప్రాంతంలో ప్రత్యేక కుంట నిర్మించి నిల్వ చేయడంతో పాటు, గురుత్వాకర్షణ శక్తి ఆధారంగా సుమారు 30 వేల నుంచి 40 వేల మందికి తాగునీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.
మాల్వాడిగుండం ప్రాంతంలో సుమారు 200 అడుగుల వెడల్పు, 300 నుంచి 400 మీటర్ల విస్తీర్ణంలో భారీ ఇంకుడు గుంత తరహా నిర్మాణాన్ని చేపట్టి భూగర్భ జలాలను రీఛార్జ్ చేయనున్నట్లు చెప్పారు. మల్లెమడుగు డ్యామ్ నీటిని కూడా సద్వినియోగం చేసుకుని మంగళం పంప్‌హౌస్ ద్వారా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**అనంతసాగరం చెరువు టూరిజం హబ్‌గా అభివృద్ధి**
శెట్టిపల్లె, తుడా లేఅవుట్లు, పరిసర ప్రాంతాల్లో భవిష్యత్‌లో సుమారు 15 వేల మందితో కొత్త నగర ప్రాంతం అభివృద్ధి చెందనున్న నేపథ్యంలో అనంతసాగరం చెరువును భారీ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు డా. దివాకర్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతోందని, నెలాఖరులోగా టెండర్లు పిలిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.
60 అడుగులు, 80 అడుగులు, 100 అడుగుల రహదారులతో అనుసంధానం కల్పిస్తూ అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

**వరదలు, నీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం**
వర్షాకాలంలో వరదలు, వేసవిలో నీటి ఎద్దడి అనే సమస్యలు తిరుపతి నగరంలో శాశ్వతంగా లేకుండా చేయడమే ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని డా. దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. నగర ప్రజలతో పాటు ప్రతిరోజూ తిరుపతికి వచ్చే సుమారు లక్ష నుంచి లక్షన్నర మంది భక్తుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టును రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే తిరుపతి నగరం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా చెరువుల నిర్వహణ, వరద నియంత్రణ, నీటి సంరక్షణలో రోల్ మోడల్‌గా, కేస్ స్టడీగా నిలిచే అవకాశం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## పి.హెచ్.సిలలో మంచి వైద్యంఅందించాలి

### జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ



**గుంటూరు, పెన్ పవర్,ఆగస్టు 18 :**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పి.హెచ్.సి)లో మంచి వైద్యం అందించి ఆదర్శంగా నిలవాలని(జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. గుంటూరు జిల్లాలో వసతులకు కొదవ లేదని, పని చేసే వాతావరణం ఉందని, వాటిని ఉపయోగించుకుని మంచి ప్రగతి చూపించాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వాతావరణం చక్కగా ఉండాలని, అనారోగ్యంతో వచ్చే వారి పట్ల ప్రేమ, అభిమానంతో మెలగాలని అన్నారు. ప్రేమతో, అభిమానంతో మాట్లాడితే అనారోగ్యం సగం తగ్గిపోతుందని చెప్పారు. మంచి వైద్యుడిగా సేవలు అందిస్తే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని గమనించాలని అన్నారు. మంచి సేవలు అందిస్తే ప్రజలు మంచిగా చెప్పుకుంటారని గమనించాలని చెప్పారు. "మీ సేవలు మీ పనితీరుకు నిదర్శనంగా" ఉంటాయని పేర్కొన్నారు.వినియోగదారుడే భగవంతుడు అనే నానుడిని గుర్తించాలని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మీరే నాయకులని, ఆదర్శంగా పని చేస్తూ, సిబ్బందిని బాగా పనిచేయించాలని అన్నారు. మంచి నాయకులుగా ఉండాలని సూచించారు. వృత్తి ధర్మం నిర్వర్తించాలని అన్నారు.ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ పనితీరుపై కొన్ని సూచికలు ఇచ్చాయని, వాటిని శత శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ "ఏ" గ్రేడ్ లో ఉండాలని, కొద్దిలో తప్పితే "బి" గ్రేడ్ లో ఉండాలని స్పష్టం చేశారు. పని తీరు మెరుగు పరచని వైద్య అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని అన్నారు. పనితీరు మెరుగు పరచుకోవాలని, లేనిపక్షంలో నిరంతర సమీక్షలు చేయుట జరుగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, వైద్య అధికారులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణపై పోలీసుల అవగాహన



**చీరాల, పెన్ పవర్,ఆగస్టు 18 :**
ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని చీరాల ఒకటో పట్టణ పోలీసులు అవగాహన కల్పించారు. ఒకటో పట్టణ సీఐ సోమశేఖర రావు, ట్రాఫిక్ ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనదారులకు హెల్మెట్ ప్రాధాన్యతను వివరించారు.రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణ రక్షణ కవచంగా పనిచేస్తుందని, ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చున్న వారు కూడా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని వారు కోరారు.హెల్మెట్ ధరించడం కేవలం జరిమానాల భయంతో కాకుండా, తమ ప్రాణాల రక్షణ కోసం బాధ్యతగా భావించాలని సీఐ సోమశేఖర రావు, ట్రాఫిక్ ఎస్ఐ పవన్ కుమార్ సూచించారు.

# వేద స్కూల్లో

## ఎన్ సి సి క్యాడెట్ల ఎంపికలు



**చిలకలూరిపేట , పెన్ పవర్, ఆగస్టు 18:**
పట్టణంలోని వేద స్కూల్లో సోమవారం ఎన్ సి సి క్యాడెట్ల ఎంపికలు జరిగాయి .ఈ సందర్భంగా విద్యార్థులకు దేహదారుడ్య పరీక్షలు నిర్వహించి క్యాడెట్లలను ఎంపిక చేశారు . ఈ ఎంపికలలో 25 ఆంధ్ర బెటాలియన్ నుండి ఎస్ ఎం బెటాలియన్ అధికారులు పాల్గొని ఎంపికలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీగిరి డేవిడ్ స్నేహల్ ఎంపికైన విద్యార్థులు అభినందించారు అలాగే పాఠశాల సి ఈ ఓ శామ్యూల్ రాజు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ ఎన్ సి సి అనేది క్రమశిక్షణకు సేవ దృక్పథానికి అకుంఠిత దీక్షకు పరోపకారశీలతకు నిదర్శనము అని కొనియాడారు అలాగే చాలా అకడమిక్ డైరెక్టర్ సత్య దీప్తి ఎన్ సి సి అనేది దేశభక్తి తో పాటు ట్రిబుల్ ఐటీ లలో సీట్లు సాధించడానికి దోహదం చేస్తుంది అలాగే ఇంటర్ విద్యార్థులకు ఆర్మీ ,హోంగార్డు, ఉద్యోగాలకు దోహదం చేస్తుందని తెలిపారు . పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఎంపికైన విద్యార్థులు అందరిని ప్రత్యేకంగా అభినందిస్తూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎన్ సి సి వల్ల కలుగుతుందని తెలిపారు .ఎన్సిసి ఏ ఎన్ ఓ ఎస్ అప్పారావు పాల్గొన్నారు .

## జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ను కలిసిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ...



**సూళ్లూరుపేట, పెన్ పవర్, ఆగస్టు 18**

రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలు అనంతరం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంత్రి నిమ్మల రామానాయుడు తో సూళ్లూరుపేట నియోజకవర్గంలో సాగునీటి అభివృద్ధి పనులకు కావలసిన నిధుల విషయమై చర్చించారు.నియోజకవర్గంలోని మీజూరు చెక్ డామ్,వాటంబేడు గ్రాయిన్,చెంబేడు రిజర్వాయర్ నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మంత్రిని కోరారు.ర

## ప్రథమ చికిత్సకు వచ్చిన రోగులను పట్టించుకోని సిబ్బంది?

**నాగలాపురం, పెన్ పవర్, ఆగస్టు 18:**

నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స కోసం వచ్చే రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి చేరుకునే రోగులు, వారి కుటుంబ సభ్యులు సిబ్బంది నిర్లక్ష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రిలో విధుల్లో ఉండాల్సిన నర్సులు, డ్యూటీ అధికారులు రోగుల పరిస్థితిని స్వయంగా పరిశీలించి అవసరమైన ప్రథమ చికిత్స అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్నిసార్లు రోగులను పట్టించుకోకుండా అక్కడ పనిచేస్తున్న అటెండర్ల ద్వారా ప్రథమ చికిత్స చేయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో అత్యవసర సమయంలో వైద్య సహాయం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది.చిన్నపాటి గాయాలు, ప్రమాదాలు, జ్వరం, ఇతర అత్యవసర సమస్యలతో ఆసుపత్రికి వచ్చే వారికి సకాలంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాల్సి ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు వాపోతున్నారు.
ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో సేవలు ఆశించిన స్థాయిలో అందకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారులు నాగలాపురం ప్రభుత్వ ఆసుపత్రి పనితీరుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రిలో సిబ్బంది విధులకు హాజరు, రోగులకు అందుతున్న ప్రథమ చికిత్స, అత్యవసర వైద్య సేవల నిర్వహణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రోగులకు




ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నాయుడుపేటలో క్షుద్ర పూజల కలకలం... భయాందోళనలో బీడీ కాలనీ ప్రజలు...



**నాయుడుపేట, పెన్ పవర్, ఆగస్టు 18**

నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలో గల స్వర్ణముఖి నదిలో నలుగురు వ్యక్తులు సోమవారం రాత్రి క్షుద్ర పూజలు చేయడం కలకలం సృష్టించింది.నాయుడుపేట పట్టణంలోని బీడీ కాలనీ సమీపంలోని స్వర్ణముఖి నదిలో క్షుద్ర పూజలు చేస్తుండడాన్ని స్థానిక యువకులు గుర్తించి, పట్టణంలోని అగ్రహారపేటకు చెందిన ఒక వ్యక్తిని చెన్నై కి చెందిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు.నదిలో భారీ రాక్షస బొమ్మ, ముగ్గులు వేసి క్షుద్ర పూజలు చేస్తుండడంతో స్థానికులకు స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. క్షుద్ర పూజలు చేస్తున్న నలుగురు వ్యక్తులు నదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

## దేవస్థానం అభివృద్ధికి 6 లక్షలు ఆర్థిక సహాయం చేసిన గోళ్ళ రాజేష్



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ ఆగస్ట్ 18**

నంద్యాల పట్టణంలోని శ్రీ కేదారేశ్వరీ సమేత శ్రీ స్థానిక ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానము నందు వివిధ అభివృద్ధి కార్యక్రమాల సందర్భంగా దేవస్థాన చైర్మన్ చలం బాబు ఆహ్వానం మేరకు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త సామాజికవేత్త గోళ్ళ రాజేష్ దేవస్థానంకు విచ్చేశారు. ఈ సందర్భంగా గోళ్ల రాజేష్ కు దేవస్థాన ఆలయ ప్రధాన అర్చకులు మంగళ వాయిద్యాలతో సాధర స్వాగతం పలికారు.దేవస్థానముకు విచ్చేసిన గోళ్ళ రాజేష్ తో దేవస్థాన చైర్మన్ దేవస్థానం చలం బాబు దేవస్థానం నందు నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలు నూతన నిర్మాణాలు,కేదారేశ్వరి దేవి అన్నదాన సత్రాలు భక్తుల వసతి గృహ గురించి సవివరంగా గోళ్ళ రాజేష్ కు వివరించారు. దేవస్థానము నందు కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను చూసిన అనంతరం గోళ్ళ రాజేష్ ఆనందం వ్యక్తం చేశారు. అందులో భాగంగా తన వంతు సహాయంగా దేవస్థాన అభివృద్ధి కార్యక్రమాలలో పాలుపంచుకొనేందుకు దేవస్థాన నిర్మాణ అభివృద్ధి కార్యక్రమాలకు ఆరు లక్షల విరాళాలం చెక్కును శ్రీ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చలం బాబుకు, దేవస్థాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అందించారు. భవిష్యత్తులో దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఆర్థిక సాయం చేసేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నట్టు గోళ్ళ రాజేష్ తెలియజేశారు.పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ముందుగా దేవ గణాధిపతి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం శ్రీ కేదారేశ్వరి సమేత శ్రీ ప్రథమనందీశ్వర స్వామి అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ చలం బాబు గోళ్ళ రాజేష్ కు శాలువాలు, పులదండలతో కూడా తో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

## జడ పోలయ్య కుటుంబానికి ఆర్థిక సాయం వేంకటాద్రి నాయుడు



**కొండాపురం పెన్ పవర్ ఆగస్టు 18.**

కొండాపురం మండలంలంప్రతి గ్రామం అభివృద్ధి చెందడమే తెదేపా లక్ష్యం చెరుకూరి వెంకటాద్రి నాయుడుకొండాపురం మండల పార్టీ మాజీ అధ్యక్షులు,కోడె వెంకటరావు చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొండాపురం మండలం కొమ్మి గ్రామంలో 210,211 బూత్ పరిధిలో భూత్ ఇంచార్జ్ లు చెరుకూరి శేషయ్య, బండ్లమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్న మండల పార్టీ మాజీ అధ్యక్షులు చెరుకూరి వెంకటాద్రినాయుడు అనంతరం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి కార్యకర్తలు జడ పోలయ్య, జడ దిలీప్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు

## ప్రజా సేవలోనే నా రాజకీయ ప్రయాణం

### " మాజీ ఎన్ డి సి సి బి చైర్మన్ కామిరెడ్డి""



**పెళ్లకూరు, పెన్ పవర్, ఆగష్టు 18**


ప్రజా సేవకునిగా కడవరి వరకు వైకాపా పార్టీలోనే ఉంటూ ప్రజల శ్రేయస్సు కోసం నా రాజకీయ ప్రయాణం సాగుతుందని మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన మంగళవారం పెళ్లకూరు మండల పరిధిలోని రావులపాడు గ్రామంలో " గుడ్ మార్నింగ్ " కార్యక్రమాన్ని తిరిగి తల పెట్టారు. ఆ గ్రామ నాయకులు, కార్యకర్తలు, మహిళలు సాదర స్వాగతం పలికారు. గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలతో పాటు, గ్రామ సమస్యలను తెలుసుకుంటూ కార్యక్రమాన్ని కొనసాగించారు. గత ప్రభుత్వంలో జగనన్న పాలనలో ప్రజలకు అందిన ఆర్థికపరమైన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామస్తులతో కలిసి చర్చించుకున్నారు. మళ్లీ అభివృద్ధి కావాలన్నా, తిరిగి మన రాష్ట్ర ముఖ్యమంత్రి గా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మీ సమస్యలు నా దృష్టికి తెస్తే, నా సమస్యలుగా భావించి పరిష్కరిస్తానని పేర్కొన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో మన పార్టీ బలపరిచిన అభ్యర్థులనే గెలిపించుకునేందుకు కలసికట్టుగా పార్టీ అభిమానులుగా పని చేయాలని కోరారు.



2029లో జగనన్నను ముఖ్యమంత్రిగా చూడాలనే లక్ష్యంతో ప్రతి నాయకుడు, కార్యకర్తలు చురుగ్గా పార్టీలో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ప్రిస్కిల్లా, గెంజి. మాతయ్య, గెంజి.మస్తానయ్య , శ్రీపురం. ముని రాజా,అక్కుపల్లి. వెంకటేష్,గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్‌తో మహేంద్రుడి ఆత్మీయ భేటీ

### సత్యవేడు రాజకీయ పరిణామాలపై మాజీ సీఎం జగన్ ఆరా



**సత్యవేడు, పెన్ పవర్, ఆగస్టు 18:**

తిరుపతి జిల్లా వరదయ్యపాలెం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు దేవళ్ల మహేంద్రుడు మంగళవారం తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మహేంద్రుడిని జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ "ఏం మహీ.. బాగున్నావా?" అని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం సత్యవేడు నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ పరిస్థితులు, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పరిస్థితిపై జగన్ ఆరా తీసినట్లు తెలిసింది.అలాగే బీసీ సెల్ అధ్యక్షుడిగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మహేంద్రుడు చేస్తున్న కృషి, చేపడుతున్న కార్యక్రమాల వివరాలను కూడా జగన్ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆప్యాయంగా పలకరించి, నియోజకవర్గ పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకోవడం ఈ భేటీకి ప్రత్యేకతగా నిలిచింది.

## చిన్నారిపై హింస.. గంటల్లోనే నిందితుల అరెస్ట్



**ఆత్మకూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**

నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కొట్టాలచెరువు గ్రామంలో తొమ్మిదేళ్ల చిన్నారిపై జరిగిన అమానుష ఘటనపై ఆత్మకూరు పోలీసులు వేగంగా స్పందించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు.. ఘటనకు బాధ్యులైన ఇద్దరు ప్రధాన నిందితులను గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు.
అంగడిలో దొంగతనం చేసిందనే అనుమానంతో తొమ్మిదేళ్ల బాలికను అక్రమంగా నిర్బంధించి, తాడుతో కట్టేసి హింసించినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలి తల్లి కడమంచి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో ఆత్మకూరు అర్బన్ సీఐ, ఎస్ఐలు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు.కేసు తీవ్రతను గుర్తించిన పోలీసులు నిందితులు పరారయ్యేలోపే పక్కా సమాచారంతో గాలింపు చేపట్టారు. కురుకుంద రోడ్డులోని ఇటుకల బట్టీ సమీపంలో దాక్కున్న ప్రధాన నిందితులు రాజు నాయక్ (ఏ1), మల్లు నాయక్ (ఏ2)లను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.బాధితురాలు మైనర్ బాలిక కావడం, ఆమె గుర్తింపు బహిర్గతమయ్యేలా వీడియో చిత్రీకరించిన అంశాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్లతో పాటు జువైనల్ జస్టిస్ చట్టం కింద కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.
ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే స్పందించి నిందితులను



అరెస్ట్ చేయడంపై స్థానికులు, ప్రజలు ఆత్మకూరు పోలీసుల చర్యలను అభినందిస్తున్నారు. ఇదిలా ఉండగా, బాధితురాలు మైనర్ కావడంతో ఆమె ఫొటోలు, వీడియోలు, గుర్తింపును వెల్లడించే వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఘనంగా కాత్యాయని వ్రతం ప్రత్యేక పూజలు

**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఆగస్టు 18.**

శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం, బుచ్చిరెడ్డిపాలెం మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఘనంగా కాత్యాయని వ్రతంభక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు విశేషంగా పాల్గొన్న మహిళా భక్తులు జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానంలో మంగళవారం కాత్యాయని వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా వ్రత కార్యక్రమాలను నిర్వహించి, కాత్యాయని అమ్మవారికి విశేష పూజలు మరియు ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. కాత్యాయని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించడం ద్వారా కుటుంబంలో సుఖశాంతులు, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగడంతో పాటు కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో వ్రత కార్యక్రమానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించిన పూజా కార్యక్రమాలు ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి. భక్తులు అమ్మవారికి కుంకుమ సమర్పించి, మంగళహారతిలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు అనుగుణంగా కాత్యాయని వ్రతాన్ని ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం, పూజా కార్యక్రమాలు, తీర్థప్రసాదాల పంపిణీ తదితర ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.